క్లుప్తంగా

సన్మానం



చిల్పూరు: మండల కేంద్రంలో హనుమకొండ నాయీబ్రాహ్మణ ఉద్యోగుల పరపతి సంఘం వార్షిక సమావేశాన్ని మొగిళిచెర్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ముత్యాల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ కుటుంబాల్లో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఐదుగురు విద్యార్థులతో పాటు బీజేపీ నాయకుడు సూర్యపెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీవనాథం, సాంబయ్య, గోవర్ధన్, సాంబయ్య, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి..

చిల్పూరు: స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌ను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ సుధాకర్, అరూరి దాసు, ఆవీదు, రవిచందర్ ఉన్నారు.

పరిహారం ఇప్పించాలి



దేవరుప్పుల: సాగునీటీ సరఫరాలో వైఫల్యం పొందిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ నష్టపోయిన వరిపంట రైతులకు ప్రభుత్వ పరంగా ఎకరానికి రూ.20 వేల పరిహారం ఇప్పించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల సీనియర్ నాయకులు బస్వ మల్లేషం, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, బిల్లా యాదవరెడ్డి, జోగు సోమనర్సయ్య, శీల తిరుమలేష్ ఉన్నారు

నియామకం



జఫర్‌గఢ్: మండలంలోని తీగారం గ్రామానికి చెందిన కలకోట సురేందర్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ కేదాసి మోహన్ ఆదేశాల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరటి ప్రభాకర్ నియామక పత్రాన్ని తిమ్మంపేటలో బుధవారం అందజేశారు. మేడ స్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా సంతోష్



పాలకుర్తి టౌన్: బీజేపీ పాలకుర్తి పట్టణ అధ్యక్షుడిగా పబ్బ సంతోష్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ



పాలకుర్తి టౌన్: జాతీయ స్థాయి సీనియర్ ఫుడ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన కందిక ఆదర్శ్, బాలబోయిన సందీప్ ప్రతిభను కనబరిచాడు. మహారాష్ట్ర నాగపూర్‌లో ఈనెల 10 నుంచి జరిగిన సింగల్ స్టోక్ పోటీల్లో ఆదర్శ్ గోల్డ్ మెడల్, సందీప్ బ్రాంచ్ మెడల్ సాధించారు. వీరితోపాటు మరో నలుగురు క్రీడాకారులు ప్రతిభన కనబరిచారు. వారిని చెన్నూరు జనతా యూత్ అధ్యక్షుడు దొంతమల్ల గణేష్, గ్రామస్తులు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జనగామ రూరల్: పట్టణానికి చెందిన కన్నారపు రాజు సెల్‌ఫోన్‌ను ఈనెల 6వ తేదీన పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, బుధవారం సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి సీఐ రఘుపతిరెడ్డి అందజేశారు.

వ్యక్తి అరెస్టు

పాలకుర్తి టౌన్: ప్రేమపేరుతో మహిళను వేధిస్తున్న మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన వంగాల ప్రవీణ్‌ను అరెస్టు చేసి జనగామ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై సాయి ప్రసన్న కుమార్ తెలిపారు. బుధవారం ఎస్సై మాట్లాడుతూ ప్రేమపేరుతో వేదిస్తూ, పెళ్లి చేసుకోవాలని బలవంతం పెడుతున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



జఫర్‌గఢ్: విద్యార్థులతో ఉపాధ్యాయులు



తరిగొప్పుల: మాట్లాడుతున్న రాంచందర్

జఫర్‌గఢ్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల అంగ్ల ఉపాధ్యాయుడు ఎస్.రాజేందర్ పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, ప్రభాకర్, గిరిజ, స్వరూపరాణి, విజయశ్రీ, కరుణశ్రీ, సిరాజ్, యాదగిరి పాల్గొన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

తరిగొప్పుల: స్థానిక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు బుధవారం సమావేశం నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శ్రీవాంకర్ రాంచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాలలో వారి అనుభవాలను పంచుకుని ఆటపాటలతో హోరెత్తించడంతోపాటు గురువుల పట్ల తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా తమ లక్ష్య సాధనలో పట్టుదలతో ముందడుగు వేయాలని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు సూచించారు. ఉపాధ్యాయులు బానోత్ రవిందర్, గాదె జోసెఫ్, బేబి, మచ్చ చిరంజీవులు, కట్ల యాదగిరి, కొండం రజని, జీడికంటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా లయన్స్ క్లబ్ అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బృందావన్ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ సుధా ప్రాంతీయ మహాసభ రీజియన్ చైర్మన్ రాపాక విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యేతో పాటు విశిష్ట అతిథులుగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, పూర్వ మల్టిపుల్ చైర్మన్ జె. జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్లబ్ భవన నిర్మాణానికి సహకరిస్తానని అన్నారు. రీజియన్ సలహాదారు కేసి జాన్ బన్నీ, ఉప గవర్నర్లు వెంకటరెడ్డి, చంద్రశేఖర్, పూర్వా గవర్నర్లు కన్న పరశరాములు, లక్ష్మీనర్సింహారావు, లవకుమార్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, ఎర్రబెల్లి రాఘవరావు, డాక్టర్ ఎం.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



ట్రైసైకిళ్లు పొందిన దివ్యాంగులతో అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు, ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. స్థానిక రైతు వేదికలో సీడీపీఓ ఫ్లోరెన్స్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు వైకల్యంపై దిగులు చెందవద్దని, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆర్‌డీఓ డీఎస్.వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ రేఖ, ఎంపీటీసీలు నర్సింహులు, రాజు, ఎంపీఓ సుధీర్, ఆర్‌ఐ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు అనుమతి తప్పనిసరి

● ఏసీపీ భీమ్‌శర్మ



భీమ్‌శర్మ, ఏసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: సిటీ పోలీస్ యాక్టు ప్రకారం ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, పార్లమెంట్ ఎన్నికల వరకు అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. స్థానిక ఏసీపీ కార్యాయలంలో బుధవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఏమైనా సమావేశాలు నిర్వహించాలంటే సువిధాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. డీజేలను పూర్తిగా నిషేధించామని, డీజే శబ్దాలతో ఆరోగ్యానికి హానికరమని, ప్రధానంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. వినోదాలు, సరదాలు అవసరమేనని, అయితే మోతాదుకు మించి చేస్తే అనర్థాలకు దారి తీస్తుందన్నారు. చదువు, ఆరోగ్యం కన్నా ఏది ప్రధానం కాదని గుర్తించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, డ్రంకెన్‌డ్రైవ్ చేస్తే ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత సన్మార్గంలో నడవాలని, దురలవాట్లకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షలు, త్వరలో జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల కోసం తగిన ఏర్పాట్లు చేశామని, పరీక్ష సెంటర్ల వద్ద ప్రత్యేక బందోబస్తు ఉంటుందన్నారు. పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, నిర్భయంగా సంతోషంగా పరీక్షలు రాయాలని, ఎలాంటి టెన్షన్‌లకు గురికావొద్దని, ప్రశాంతంగా ఉండాలని ఆయన సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన యువ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి



జనగామ: కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాను బుధవారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్‌తో మాట్లాడారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రామచంద్రం, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్ధిరాములు, జక్కుల వేణు, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, మాసాపేట రవీందర్ ఉన్నారు.

ఏసీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఏసీపీగా భీంశర్మ ఇటీవల బాధ్యతలు చేపట్టగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకుకూరలు, పండ్లు ఆరోగ్యానికి మేలు

తరిగొప్పుల: ఆకు కూరలు, పండ్లల్లో పోషక విలువలు అధికంగా ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత తెలిపారు. మండలంలోని కొత్తతండా అంగన్‌వాడీలో గర్భిణులు, బాలింతలకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో పౌష్టికాహారంపై ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవడంతో శరీరానికి కావలసిన పోషకాలు అభించడంతోపాటు గర్భిణులు, బాలింతల్లో రక్తహీణత కలగదని అన్నారు. మధ్యాహ్నం 2 గంటలు, రాత్రి 8 గంటలు నిద్ర అవసరమని చెప్పారు. టీచర్ వనిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి ముందుకొచ్చిన దాత

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద బస్ షెల్టర్ లేక ప్రయాణీకులు, విద్యార్థులు ఇబ్బంది పడుతుండగా సొంత ఖర్చులతో తాను నిర్మిస్తానని ముందుకు వచ్చాడు గ్రామానికి చెందిన గుర్రాల లక్ష్మణ్. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకోడానికి వస్తుంటారు. ఇక్కడ బస్ షెల్టర్ లేక పోవడంతో ఎండలోనే నిలబడాల్సి వస్తోంది. దీన్ని గమనించిన లక్ష్మణ్ సొంత ఖర్చులతో నిర్మాణం చేయిస్తానని అనడంతో బుధవారం గ్రామస్తులతో కలిసి శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, రమేష్, ఉప్పలయ్య, కొంరయ్య, యాదగిరి, రవి, రాములు, భూపాల్ రెడ్డి, సుధాకర్, స్వామి పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లిలో అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు స్థానిక ఎంపీటీసీలు కర్ణాల వేణుగోపాల్, నీల శైలజరమేష్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బావండ్ల కృష్ణంరాజు, కాపర్తి హరిప్రసాద్, గాలి తిరుపతి, తేలు అంజయ్య, లింగారెడ్డి, భాస్కర్, యాకంరెడ్డి, తిరుపతి, రాజు, సంతోష్, అంబదాస్, నర్సింహులు పాల్గొన్నారు.

పాలకుర్తి: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం సమీపంలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీమదార్ మంజూరు చేయించిన నిధులతో పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి సర్వర్, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, పెనుగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఉద్యమాలతోనే నాయకత్వ లక్షణాలు



కేసీఆర్‌తో ఎర్రబెల్లి, పీఎస్ఆర్

దేవరుప్పుల: ప్రజా ప్రజాసమస్యల సాధన కోసం ఉద్యమాలు చేపట్టినప్పుడే యువతలో నాయకత్వ లక్షణాలు వస్తాయని బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్ రామిరెడ్డి(పీఎస్ఆర్)కలిసి జిల్లాలో వరి పంటల సాగుకు నెలకొన్న సాగునీటి ఇబ్బందులపై, ఆందోళన విషయమై ప్రస్తావించగా ఇలా స్పందించినట్టు వారు తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమ తరహాలో పార్టీ శ్రేణులు ప్రజాసమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేయాలని సూచించినట్టు పేర్కొన్నారు.

‘కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు పల్లాకు లేదు’



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రజల మన్ననలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో గోదావరి జలాల కోసం పైపులైన్లు వేయించి రిజర్వాయర్లను నిర్మిస్తే, వాటిలో నీటిని నింపి తామే జలాలను తెచ్చామని బీఆర్ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సరైంది కాదన్నారు. రైతు పక్షపాతిగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ స్టే కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాస్, జిల్లా నాయకులు పిన్నింటి నారాయణరెడ్డి, నరేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

జనగామ/బచ్చన్నపేట: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మాదిగ ఉప కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని బేడ బుడిగ జంగాల రాష్ట్ర అధికార ప్రతినిధులు కల్యాణం చంద్రమౌళి, సిరిపాటి మదనయ్య అన్నారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ ప్రత్యేక కార్పొరేషన్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలి



ఎల్లయ్యను పరామర్శిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య అన్నారు. మండలంలోని శివునిపల్లికి చెందిన వంగ ఎల్లయ్య ఇటీవల గీతవృత్తిలో భాగంగా తాటిచెట్టుపై నుంచి పడి గాయపడగా బాధితుడిని ఆయన బుధవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ గీతవృత్తిలో కార్మికుల ప్రమాదాలు అధికం అవుతున్నాయని, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని ఆదుకోవాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములు, ప్రధాన కార్యదర్శి సట్ల రాజు, వంగ శ్రీనివాస్, వంగ సురేష్, కూనూరు ఎల్లగౌడ్, పల్లె పెంటయ్య ఉన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



జనగామ రూరల్: శ్రీకృష్ణదేవరాయుల కాలంలో మొల్ల రామాయణం రాసిన మొల్లమాంబ జయంతి వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మణికొండ నర్సింహులు, జివికపల్లి నరహరి, సోమేశ్వర్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

లింగాలఘణపురం: మండలంలోని చీటూరు, సిరిపురం, మంథోనిగూడెం, జీడికల్ గ్రామాల్లో ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీటీసీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు బాలరాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

జఫర్‌గఢ్: పదోతరగతి పరీక్షలంటే విద్యార్థులు భయాందోళన చెందొద్దని ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీలో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని లయోల హైస్కూల్‌లో విద్యనభ్యసించిన కడమంచి బన్నీ, మాలోత్ అఖిల, ఎస్‌కే.సర్దార్, బానోత్ నాగరాజు కబడ్డీ క్రీడలో విశేషంగా రాణిస్తున్నారు. పాఠశాల పీఈటీ సుధాకర్ కబడ్డీ క్రీడలో శిక్షణ ఇస్తుండగా బన్నీ ఇటీవల జాతీయ స్థాయికి ఎంపికకాగా, మిగిలిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. కాగా, పాఠశాల కరస్పాండెంట్ పాలకుర్తి శ్రీధర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్లు సాంబారి సత్యనారాయణ, మండల శంకర్ తదితరులు జాతీయ, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, పీఈటీని అభినందించారు.

శుభ్రత పాటించాలి

జనగామ రూరల్: విద్యార్థులు దిన చర్యలో భాగంగా చర్మసంబంధిత వ్యాధులు సోకకుండా శుభ్రత పాటించాలని, అలాగే పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని

శివునిపల్లిలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలతో కలిసి బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ముస్క రాజు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు, ప్రజలు గమనించి తనిఖీలలో పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, సీఆర్‌పీఎఫ్ సీఐ వైసీహెచ్‌కే రావు, ఎస్సై పెరుమాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

‘రైతుల బాధలు పట్టించుకోని ఎమ్మెల్యే’

బచ్చన్నపేట: భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే వారి బాధలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టించుకోవడం లేదని నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలకు సాగునీరు అందక ఎండిపోతుంటే ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వెంటనే గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి, గబ్బెట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు రాపోలు పృథ్వీ అందజేశారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన చెవిటి రజినీకాంత్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేల సాయం బుధవారం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన యాట లచ్చయ్య–లక్ష్మి దంపతుల కూతురు దివ్య వివాహానికి రూ. 5వేల సాయం అందించారు.

పేదలకు అండగా కాంగ్రెస్

చిల్పూరు: పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని ఎంపీటీసీ పాశం శిరీష, పార్టీ జిల్లా నాయకుడు పాశం సురేష్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలో బుధవారం గృహజ్యోతి పథకం కింద జీరో కరెంటు బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. సాంబయ్య, చాగంటి మణి, కొంరయ్య, ఎల్లయ్య, చంద్రమౌళి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

దేవరుప్పుల: భూగర్భజలాలు అడుగండి నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తానని ఎంపీటీసీ మేడ కల్యాణి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నీర్మాల గ్రామంలోని శ్మశాన వాటికలో ఎంపీటీసీ నిధుల కింద బోరు పనులను ప్రారంభించారు.

నివాళి

దేవరుప్పుల: మండల కేంద్రంతోపాటు చిన్నమడూరులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉప్పల రామయ్య, మడికొండ కుమారస్వామి అకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఇరు గ్రామాల్లో వారిద్దరి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించి ఆర్థిక సాయం చేశారు.

మహిళ మృతి

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తిలో చింతచెట్టుపై నుంచి పడి మొండ్రాయిలోని గిర్ని తండాకు చెందిన దరావత్ సుశీల (52) మంగళవారం చింతచెట్టుపై నుంచి పడి అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. వనపర్తిలో చింత చెట్టు దులిపి చింతపండు ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు జారిపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. జనగామలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించి చికిత్స పొందుతూ మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిల్పూరు: పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేసేది ఎంఆర్పీఎస్ అని నియోజకవర్గం ఇన్‌చార్జ్ నీరటి ప్రభాకర్ అన్నారు. రాజవరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కేదాసి మోహన్ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల రవీందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ త్వరలో గ్రామాల్లో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.

గుడుంబా పట్టివేత

నర్మెట: నిషేధిత గుడుంబాతోపాటు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండంలోని సూర్యబండతండాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు .. గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణు సిబ్బంది ధనుంజయ్, రహమత్ అలితో తండాకు చేరుకోగా కేలోత్ రమేష్ గుడుంబా క్యానుతో పారిపోవడానికి యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు ఆరు లీటర్ల గుడుంబాతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపారు.

స్వయంపాలన దినోత్సవం

జనగామ రూరల్/లింగాలఘణపురం/కొడకండ్ల: జనగామ పట్టణంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాల, లింగాలఘణపురం మండలంలోని సిరిపురం ప్రాథమికోన్నత, కొడకండ్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి



నర్సయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఎన్నకూస(తీగల) నర్సయ్య(80) బుధవారం మృతి చెందాడు. సీపీఎం నాయకుడిగా, గ్రామ మాజీ ఉపసర్పంచ్‌గా విశేష సేవలు అందించిన ఆయన మృతి విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఇప్పగూడెం చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో సీపీఎం నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జోహార్ కామ్రేడ్ నర్సయ్య అంటూ నినాదాలు చేశారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉడుత రవీందర్, మండల కార్యదర్శి మునిగెల రమేష్, రాపర్తి సోమయ్య, గట్ల కొండల్‌రెడ్డి, కొడపర్తి యాకయ్య, మల్లారెడ్డి, కరుణాకర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి టౌన్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ స్కూల్, మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడెంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీటీడీఓలు సౌజన్య, ఎల్ శ్రీరాములు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 15న హనుమకొండ ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీలో ఉదయ 8 గంటలకు ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాల లోపు ఉండాలని, 135 సెంటీమీటర్ల ఎత్తు, 28 కిలోల బరువుతో పాటు ఐదో తరగతి చదువుతువుతున్నట్లు హెచ్‌ఎం నుంచి ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. వివరాల కోసం స్పోర్ట్స్ అధికారి డాక్టర్ అజ్మీరా కిస్టు నాయక్‌ను సంప్రదించాలని సూచించారు.